# ఉపవాసం
# Fasting

**పాఠ్యోద్దేశం:** పాత నిబంధన ఆధారంగా ఉపవాసమును యేసు యొక్క ఆనాటి శ్రోతలు ఎలా అర్థం చేసుకున్నారో గ్రహించటం మరియు నేడు దేవుని ప్రజల కోసం ఉపవాసం యొక్క ప్రయోజనాన్ని తెలియజేయటం.

**లేఖనం:** మత్తయి 6:16-18.

## ఉపోద్ఘాతం

మత్తయి సువార్త ఆరో అధ్యాయంలో అతడు వ్రాసిన మూడు "నీతి కార్యాలలో" ఒకటి ఉపవాసం. దానములివ్వడం మరియు ప్రార్థన అనే కార్యములవలెనె, "మనం ఉపవాసం చేయునప్పుడు" ప్రతిఫలాన్ని పొందటంలో దేవుని ప్రజలు విఫలమవ్వవచ్చు అని యేసు ఉపవాసాన్ని గూర్చి కూడా శ్రద్ధ కలిగియున్నాడు. "మనం ఉపవాసం చేసినట్లయితే" అని యేసు చెప్పలేదు, "మనం ఉపవాసం చేసినప్పుడు" అని మాత్రమే చెప్పాడు. యేసు యొక్క ఆనాటి శ్రోతలు "మనుష్యులకు కనబడవలెనని" ఉపవాసం చేసినప్పటికిని, "ఉపవాసం" అనే పదానికి సంబంధించిన వివరణ వారికవసరం లేదు. వాస్తవానికి, మత్తయి సువార్తను చదివే సంఘ సభ్యులు కూడా ఉపవాసం అంటే ఏమిటో గ్రహిస్తారు. అపొస్తలుడైన పౌలు మరియు కొంత మంది సంఘ నాయకులు ఒక ప్రాముఖ్యమైన సంఘటనను గూర్చి వారొక నిర్ణయాన్ని తీసుకోకమునుపు సంఘాన్ని ఉపవాసంలో నడిపించేవారు (అపొ. కార్య. 13:2,3; 14:23). సభ్యుల గృహాలలో ఉపవాసమనేది జీవితంలో క్రమంగా జరిగే ఒక భాగమైయున్నది (1 కొరింథీ. 7:5). జీవితాన్ని గూర్చిన సత్యాన్ని వెదుకుతున్న కొర్నేలి వంటి ప్రజలు కూడా ఉపవాసాన్ని ఆచరించారు (అపొ. కార్య. 10:30). యోనా ప్రకటన విన్న తర్వాత అన్య పట్టణమైన నీనెవె ప్రజలు ఉపవాసమున్నారు (యోనా 3:5).

గ్రీకు పదం "నెస్టెయా" (nesteia) ఉపవాసం అనే పదం కొరకు తర్జుమా చేయబడింది ("నె" అనగా ప్రతికూలమైన ఉపసర్గము మరియు ఎస్తియో అనగా తినుట అంటే దీని అర్థము= తినకుండుట). ఆహారాన్ని స్వచ్ఛందంగా (ఎవ్వరి బలవంతము లేకుండా) మరియు స్వతహాగా మానివేయటం అని దీని అర్థం (కీర్తన 109:24). యేసుక్రీస్తు భూమి మీద పరిచర్య ప్రారంభించేటప్పుడు ఆయన ఉపవాసం చేస్తాడు (మత్తయి 4:2). భూమి మీద యేసు తన శిష్యులతో ఉన్నప్పుడు, శిష్యులు ఉపవాసం చేయలేదు; అయినా, ఆయన వారిని విడిచి పెట్టేటప్పుడు వారు చేస్తారని ఆయన చెప్పాడు.

> *అప్పుడు యోహాను శిష్యులు ఆయన యొద్దకు వచ్చి -పరిసయ్యులును, మేమును తరచుగా ఉపవాసం చేయుచున్నాము గాని నీ శిష్యులు ఉపవాసం చేయరు; దీనికి హేతువేమని ఆయనను అడుగగా యేసు-పెండ్లికుమారుడు తమతో కూడ నుండు కాలమున పెండ్లియింటివారు దుఃఖపడగలరా? పెండ్లి కుమారుడు వారి యొద్దనుండి కొనిపోబడు దినములు వచ్చును, అప్పుడు వారు ఉపవాసం చేతురు.* మత్తయి 9:14,15.

ఉపవాసంపై ప్రస్తుత సంఘ నాయకులు అంతగా దృష్టి పెట్టడం లేదనేది స్పష్టము. ఒకవేళ కొంత మంది చేసినా, ఈ రచయిత మాత్రం ఈ నీతికార్యంలో పాలిభాగస్థుడు కావడానికి ఆధిక్యతగా భావించుట లేదు. ఇది నిజమైయుండగా ఉపవాసాన్ని గూర్చిన సమాచారాన్ని పాత నిబంధన నుండి మనం పొందవలసి వుంది.

## పాఠం

యూదా యింటివారు వారి చెరకాలంలో కొన్ని సార్లు క్రమంగా ఉపవాసాన్ని నిర్ణయించారు. ఈ ఉపవాసములు యెహోవా దేవుడ్ని బతిమాలుకొని వెదకుఉద్దేశంతో చేయబడిన ఉపవాసములుగా కనబడుతున్నాయి (జెకర్యా 8:21). భూమి మీద యేసు తన కాలంలో హెచ్చరించినట్లుగా, వారు ఎల్లప్పుడూ ప్రభువును వెదకు తున్నవారుగా ఉండియుండకపోవచ్చు. అందుకే దేవుడు వారిని ఇలా అడిగాడు, "ఈ జరిగిన డెబ్బది సంవత్సరములు ఏటేట అయిదవ నెలను ఏడవ నెలను మీరు ఉపవాసముండి దుఃఖము సలుపుచు వచ్చినప్పుడు నాయందు భక్తి కలిగియే ఉపవాసముంటిరా?" జెకర్యా 7:5.

> *సైన్యములకు అధిపతియగు యెహోవా ఆజ్ఞ ఇచ్చునదేమనగా-నాలుగవ నెలలోని ఉపవాసం, అయిదవ నెలలోని ఉపవాసం, ఏడవ నెలలోని ఉపవాసం, పదియవ నెలలోని ఉపవాసం యూదా యింటి వారికి సంతోషమును ఉత్సాహమును పుట్టించు మనోహరములైన పండుగలగును. కాబట్టి సత్యమును సమాధానమును ప్రియముగా ఎంచుడి.* జెకర్యా 8:19.

బబులోనులో డెబ్బది సంవత్సరాల చెర తర్వాత ఎజ్రా యూదులను యెరూష లేమునకు తిరిగి తీసుకొని వస్తుండగా, వారితో పాటు ఉండాలని కొంత మంది లేవీ యులను అతడు ఏర్పాటు చేసాడు. యాజకుడు మరియు శాస్త్రియైన ఎజ్రా ప్రజల కొరకు ఉపవాసాన్ని నిర్వహించాడు (ఎజ్రా 8:15-23; నెహెమ్యా 8:1,2).

> *అప్పుడు దేవుని సన్నిధిని మమ్మును మేము దుఃఖపరచుకొని, మాకును మా చిన్న వారికిని మా ఆస్తికిని శుభ ప్రయాణము కలుగునట్లుగా ఆయనను వేడుకొనుటకు అహావా నది దగ్గర ఉపవాసముండుడని ప్రకటించితిని... మేము ఉపవాసముండి ఆ సంగతినిబట్టి మా దేవుని వేడుకొనగా ఆయన మా మనవిని అంగీకరించెను.* ఎజ్రా 8:21, 23.

ప్రార్థనలలో దేవుడ్ని అడిగే నిమిత్తం ఆయన యెదుట తమ్మును తాము దుఃఖపరచుకొనుటయు మరియు తమ్మును తాము తగ్గించుకొనుటయు ఈ యూదుల ఉపవాసం యొక్క ఉద్దేశమైయున్నది. ప్రభువు వారి ప్రార్థనను విని ఏదో ఒక విధానంలో వారి మనవిని ఆలకించాడని ఎజ్రా తలంచాడు. నెహెమ్యా షూషను కోటలో అహష్వేరోషు రాజునొద్ద

గిన్నె అందించువాడుగా ఉన్న సమయంలో అతడు యెరూషలేమును గూర్చి దుఃఖంతో ఉపవాసముండి ప్రార్థించాడు (నెహెమ్యా 1:4). చివరిగా యూదులు యూదయకు తిరిగివచ్చి వారి పట్టణాలలో స్థిరపడిన తర్వాత, నెహెమ్యా జనులందరిని ఒక చోటికి పిలిచాడు. "యెహోవా ఇశ్రాయేలీ యులకు ఆజ్ఞాపించిన మోషే ధర్మశాస్త్ర గ్రంథమును" తెమ్మని ఎజ్రాకు చెప్పబడింది. నెహెమ్యా 8:1. "యెహోవా మోషేకు దయచేసిన గ్రంథములో చూడగా, ఏడవ మాసపు ఉత్సవకాలమందు ఇశ్రాయేలీయులు పర్ణశాలలలో నివాసము చేయవలెనని వ్రాయబడియుండుట కనుగొనెను." నెహెమ్యా 8:14 (16,17 కూడా చూడండి). తిష్రి అని పిలువబడే ఏడవ నెల పదో రోజున "ప్రాయశ్చిత్త దినము" తర్వాత వచ్చే ఈ సబ్బాతును లేక "పర్ణశాలల పండుగ" ను యెహోవా దేవుడు నియమించాడు (లేవీయ. 16:1-34; యోహాను 7:2).

ఆ గ్రంథం నుండి ఎజ్రా చదవడాన్ని వినిన కొన్ని దినాల తర్వాత, 24వ దినమున "ఇశ్రాయేలీయులు ఉపవాసముండి గోనెపట్టలు కట్టుకొని తల మీద ధూళి పోసికొని కూడి వచ్చిరి. ఇశ్రాయేలీయులు అన్యజనులందరిలోనుండి ప్రత్యేకింపబడినవారై నిలువబడి, తమ పాపాలను తమ పితరుల పాపాలను ఒప్పుకొనిరి." నెహెమ్యా 9:1,2.

వారు తమ పాపములను ఒప్పుకొనుటకు మరియు అన్యజనులందరిలోనుండి ప్రత్యేకింపబడుటకు వారు వచ్చేలా మూడు మూలకములు పనిచేసాయి. మొదటిగా, దేవుడు తన వాక్యం ద్వారా వారితో మాట్లాడుచుండెను. రెండవదిగా, వారు ప్రార్థనలో తిరిగి దేవునితో మాట్లాడుచుండిరి. మూడవ మూలకము వారి ఉపవాసమే. **ఇదే మన పాఠంలో "ఆహారము."** ఈ సందర్భంలో వారి ఉపవాసం ఎలాంటి పాత్ర వహించింది? కేవలం దేవుని చేత మాత్రమే చూడబడిన, "నిష్కాపట్య దృష్టి"తో కూడిన వారి ఉపవాసం యొక్క లాభము ఏమైయుండెను? మనం యీ ఆలోచనను మన మనస్సులలో ఉంచుకొని మన పాఠంలో తర్వాత చూద్దాము. ఉపవాసం చేసే ప్రజలకు ప్రతిఫలమిచ్చుటకై మానసికమైన మౌనం (Mental incubation) మరియు ఉపవాసం అనేవి కలిసి పనిచేస్తాయి.

మనం మరొక సందర్భాన్ని పరిశీలిద్దాం. బెన్యామీనీయులలో ఒకడు చేసిన అపరాధాన్ని బట్టి తమ తోటి దేశ నివాసుల యెడల వ్యత్యాసంలో ఉన్నట్లు తమను తాము కనుగొన్నారు. అపరాధం చేసిన వారిని బెన్యామీనీయులు ఇశ్రాయేలీయులకు అప్పగించడానికి నిరాకరించారు. గోత్రాల మధ్య యుద్ధం రేగింది. ఇశ్రాయేలీయులు తమ సహోదర వంశమైన బెన్యామీనీయులతో యుద్ధం చేసినప్పుడు ఇశ్రాయేలీయులు 40వేల మంది మనుష్యులను యుద్ధంలో కోల్పోయారు. ఈ పరిస్థితిలో మనం పరిగణించాల్సిన విషయాలు ఇవే: ఇశ్రాయేలీయులలో 4 లక్షల మంది మనుష్యులకు వ్యతిరేకంగా కత్తి దూయగల 26 వేల మందిని మాత్రమే బెన్యామీనీయులు సమకూర్చగలిగారు. యుద్ధంలో ముందుగా ఏ గోత్రపు వారు వెళ్లాలో దేవుని దగ్గర ఇశ్రాయేలీయులు విచారణ చేసారు. దేవుడు మొదటిగా యూదా గోత్రాన్ని వెళ్లమని నియమించాడు. వారు వెళ్లినప్పుడు 22వేల మందిని కోల్పోయారు. తర్వాత ఇశ్రాయేలీయులు తమ సహోదర గోత్రంతో యుద్ధాన్ని కొనసాగించాలా వద్దా అని విచారించారు. దేవుడు "వెళ్లమని" చెప్పాడు. వారు వెళ్లారు, అయితే మరొక 18వేల మంది ఇశ్రాయేలీయులు హతమయ్యారు. అయితే ఈ సమస్యలో మూడవ సన్నివేశం క్రింద ఉంది:

> *అప్పుడు ఇశ్రాయేలీయులందరును జనులందరును పోయి, బేతేలును ప్రవేశించి యేడ్చుచు సాయంకాలము వరకు అక్కడ యెహోవా సన్నిధిని కూర్చుండుచు ఉపవాసముండి దహనబలులను సమాధానబలులను యెహోవా సన్నిధిని అర్పించిరి... ఇశ్రాయేలీయులు మరల మా సహోదరులైన బెన్యామీనీయులతో యుద్ధమునకు పోదుమా, మానుదుమా? అని యెహోవాయొద్ద విచారణ చేయగా యెహోవా -వెళ్లుడి రేపు నీ చేతికి వారిని అప్పగించెదనని సెలవిచ్చెను. న్యాయాధి. 20:26-28.*

ఉపవాసాన్ని గూర్చిన మన అభ్యాసం యొక్క ప్రయోజనం కొరకు దయచేసి ఈ ప్రశ్నలను పరిగణించుము: దేవుడు వారికిచ్చిన విజయానికి వారి ఉపవాసం యొక్క సంబంధము ఏమిటి? వారి కన్నీళ్లు నిజమైనవని దేవుడ్ని ఒప్పించటానికి రోజంతా వారు తినకుండా మానివేసారనేది నిజమా? వారి స్వంత పాపాల యొక్క ప్రాయశ్చిత్తము కొరకు "దహన బలులను" విలువైనవిగా వారి ఉపవాసం చేసిందా (లేవీయ. 1:4)? ఉపవాసంతో పాటుగా సమాధాన బలులు కూడా అర్పింపబడ్డాయి (లేవీయ. 7:11-18). ఇశ్రాయేలీయులు తమవారి బలానికి బదులుగా మొదటి రెండు యుద్ధాలలోను వారు ఒడిపోయారు. దీని తర్వాత ఇశ్రాయేలీయులు దేవుని యెదుట చేరుటకు బేతేలు నొద్ద కూడుకున్నారు, రోజంతా వారు ఏడ్చి ఉపవాసం ఉండి ప్రార్థించిన తర్వాత దహన బలులను మరియు సమాధాన బలులను అర్పించారు. వారి శత్రువుపై దేవుడు వారికి విజయాన్ని ఇవ్వటంలో ఉపవాసం అనేది ఎలాంటి పాత్ర వహించింది? ఈ ప్రశ్నలకొచ్చే జవాబు నేడు ప్రభువు ప్రజల కోసం ఉపవాసం యొక్క ప్రయోజనాన్ని గ్రహించేలా సహాయం చేస్తుంది. ఆ సంగతిని అభ్యసించి దాని గూర్చి ఆలోచిద్దాం. ఆలోచించకుండా నేర్చుకోవడం అనేది ఉండదు. అయిననూ, ఆలోచించడానికి నేర్చుకున్నది ఏమీ లేకపోతే ఆలోచించడం కూడా జరగదు. పైన చెప్పబడిన సందర్భాలు ఆలోచించడానికి మరియు ఇంకా ఎంతో అభ్యసించడానికి చెప్పబడ్డాయి.

రాజైన అహష్వేరోషు తన రాజ్యమందు ప్రతి సంస్థానంలో నివసిస్తున్న యూదుల్ని నాశనం చేయటానికి హామాను వలన ప్రభావితం చేయబడిన తర్వాత వారందరూ ఉపవాసం చేసారు (ఎస్తేరు 4:3). ఎస్తేరు ఈ ప్రజల పక్షంగా తన భర్తను సమీపించాలని మొర్దెకై అడిగాడు. ఆమె తన సోదరుడైన మొర్దెకైతో ఇలా అనెను:

*నీవు పోయి షూషనునందు కనబడిన యూదులనందరిని సమాజమందిరమునకు సమకూర్చి, నా నిమిత్తము ఉపవాసముండి మూడు దినములు అన్న పానములు చేయకుండుడి; నేనును నా పనికత్తెలును కూడ ఉపవాసందుము; ప్రవేశించుట న్యాయవ్యతిరిక్తముగా నున్నను నేను రాజునొద్దకు ప్రవేశించుదును; నేను నశించిన నశించెదను. అటువలెనే మొర్దెకై బయలు దేరి ఎస్తేరు తనకు ఆజ్ఞాపించిన యంతటి ప్రకారముగా జరిగించెను.* *ఎస్తేరు 4:16, 17.*

“కాగా హామాను మొర్దెకైకి సిద్ధముచేసిన ఉరికొయ్య మీద వారు అతనినే ఉరితీసిరి. అప్పుడు రాజు యొక్క ఆగ్రహము చల్లారెను.” ఎస్తేరు 7:10. ఈ సంఘటన మనకు ఉపవాసాన్ని గూర్చిన భౌతిక నిర్వచనాన్ని ఇస్తుంది. అంటే ఆహారాన్ని మానివేయడమే కాని ఈ సందర్భంలో వారు నీళ్లు కూడా త్రాగలేదు. ఒక వ్యక్తి యొక్క జీర్ణ వ్యవస్థను పూర్తిగా ఖాళీ చేయుటకు మూడు రోజులు ఉపవాసమనేది చాలినంత సమయం. అనేక మంది క్రైస్తవుల పరిధులకు మించి ఒక క్రమశిక్షణ కొరకు ఉపవాసం ఉన్నది అనేది స్పష్టం. బహుశ లోకానికి “ఉప్పుగాను మరియు వెలుగు”గాను ఉండాలనే తీవ్రతను మనం ఎదుర్కొని యుండలేదు. మనం “దైవ భక్తిగల జీవితాలను” జీవించినప్పుడు మనకేమి సంభవిస్తుందో అనే దాని గూర్చి పౌలు తిమోతికి చెప్పుచున్న దానిని మనం అర్థం చేసుకుంటే, ఉపవాసం కొరకైన అవసరతను మనం చూస్తాము (2 తిమోతి 3:12).

దేవుడు జోక్యం చేసుకుంటాడని రాణియైన ఎస్తేరు నమ్మింది; కాబట్టి, యూదులు చేసిన ఆ ఉపవాస కార్యక్రమం ఆయన దృష్టి కోసమే ఉన్నది. ఎవరో చూడాలని వారు చేయలేదు, కాని దేవుడు మాత్రమే చూడాలని వారు ఉపవాసాన్ని చేసారు. మూడు రోజుల వారి ఉపవాస సమయంలో షూషనులో ఉన్న యూదులు, అలాగే ఎస్తేరు మరియు తన పనికత్తెలు ఎడతెగక ప్రార్థించారని మనం నమ్మగలం. కాబట్టి, ఎస్తేరు యొక్క పని విజయవంతం కావాలని మూడు రోజులు ఆకలిగొని దప్పిగొని ప్రార్థించిన క్రమశిక్షణ గల ప్రజలు ఉన్నారు. అయితే ఎస్తేరు గ్రంథంలో ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. అయినా యూదులు తమ పరిస్థితిని ఆయన ఎరిగియున్నాడని వారు నమ్మారు.

బహుశ, సౌలు మరణించిన సమయంలో జరిగిన సంఘటనలను పరిశీలించటాన్ని బట్టి మనం కొంత అంతర్దృష్టిని సంపాదించగలం. ఫిలిష్తీయులు రాజైన సౌలును మరియు అతని సైన్యాన్ని ఓడించారు. “ఈలాగున సౌలును అతని ముగ్గురు కుమారులును అతని ఆయుధములను మోయువాడును అతని వారందరును ఒక దినముననే మరణమైరి.” 1 సమూ. 31:6. అప్పుడు యాబేష్గిలాదు వారు “వారి శల్యములను తీసి యాబేషులోని పిచులవృక్షము క్రింద పాతిపెట్టి యేడుదినములు ఉపవాసముండిరి.” 1 సమూ. 31:13. ఎక్కువ సమయం ఉపవాసంతో పాటు మరింత దుఃఖం కలిసియుండెను. తర్వాత సౌలు మరణవార్తను దావీదు తెలుసుకున్నాడు. సౌలు అపజయం దావీదు భవిష్యతులో వ్యక్తిగతంగా ఒక లాభమైనప్పటికిని, సంఘటనల యొక్క తాకిడి మరియు ఇశ్రాయేలీయుల భవిష్యత్తును గూర్చిన చింత దావీదును మరియు అతని మనుష్యులను గంటల కొలది ఏడ్చి, దుఃఖించి ఉపవాసం ఉండేలా చేసింది.

*దావీదు ఆ వార్త విని తన వస్త్రములు చింపుకొనెను. అతని యొద్ద నున్న వారందరును ఆలాగున చేసి సౌలును యోనాతానును యెహోవా జనులును ఇశ్రాయేలు యింటి వారును యుద్ధములో కూలిరని వారిని గూర్చి దుఃఖపడుచు ఏడ్చుచు సాయంత్రము వరకు ఉపవాసముండిరి.*
*2 సమూ. 1:11,12.*

కొన్ని సంవత్సరాల తర్వాత బత్షెబ వలన అక్రమంగా జన్మించిన కుమారుడు చావకూడదని దేవుని శాసనం మారేలా దావీదు ఉపవాసముండి దేవుడ్ని వేడుకున్నాడు. దయచేసి 2 సమూ. 12:11-23 చదవండి. దేవుడు కృప చూపి బిడ్డను బ్రతుకనిస్తాడని దావీదు నిరీక్షించాడు. దావీదు నేల మీద కూర్చుండి ఉపవాసముండి దేవుడ్ని బ్రతిమిలాడినా ఆ చర్య దేవుని ఉద్దేశాన్ని మార్చలేదు. దీని నుండి మనం నేర్చుకునే దేమిటంటే దావీదు పట్ల దేవుడు కృప చూపడానికి ఇది మాత్రమే విన్నపించుకోగల మార్గమని అతడు తలంచాడు. గనుక దావీదు తనను తాను తగ్గించుకొని ఉపవాసం చేసాడు. ఈ సందర్భంలో ఇది అతనికి పనిచేయకపోయినా, ఉపవాసం యొక్క లాభాన్ని విశ్లేషించటంలో అతడు సరిగానే ఉన్నాడు.

ఉపవాసం యొక్క మన విశ్లేషణలో మనం చేర్చుకోగల పాత నిబంధనలో ఉన్న కొన్ని ఇతర ఉపవాస సందర్భాలు క్రింద ఉన్నాయి. మరియు దేవునికి చేసే ఆరాధన యొక్క ఈ రూపాన్ని చేయాలని కోరుకునే మనలో ఉన్నవారికి ఉపవాసం యొక్క లాభం తెలియచేయ బడుతుంది.

*వారు మిస్పాలో కూడుకొని నీళ్లు చేది యెహోవా సన్నిధిని కుమ్మరించి ఆ దినము ఉపవాసముండి- యెహోవా దృష్టికి మేము పాపాత్ములమని ఒప్పుకొనిరి. మిస్పాలో సమూయేలు ఇశ్రాయేలీయులకు న్యాయము తీర్చుచువచ్చెను.* *1 సమూ. 7:6.*

*అంతట నేను గోనెపట్ట కట్టుకొని, ధూళి తలపైన వేసికొని ఉపవాసముండి, ప్రార్థన విజ్ఞాపనలు చేయుటకై ప్రభువగు దేవుని యెదుట నా మనస్సును నిబ్బరము చేసికొంటిని,* *దానియేలు 9:3.*

*అందుకు యెహోషాపాతు భయపడి యెహోవా యొద్ద విచారించుటకు మనస్సు నిలుపుకొని, యూదాయంతట ఉపవాస దినము ఆచరింపవలెనని చాటింపగా...* *2 దిన. 20:3.*

**దేవుడైన యెహోవా చేత ఇశ్రాయేలు పైకి పంపబోవు గొప్ప మిడుతల దండును గూర్చిన భయయానికి స్పందనగా ఉన్న సందర్భం క్రింద ఉంది.**

*యాజకులారా, గోనెపట్ట కట్టుకొని అంగలార్చుడి. బలిపీఠమునొద్ద పరిచర్య చేయువారలారా, రోదనము చేయుడి. నా దేవుని పరిచారకులారా, గోనెపట్ట వేసుకొని రాత్రి అంతయు గడపుడి.*

*నైవేద్యమును పానార్పణమును మీ దేవుని మందిరమునకు రాకుండా నిలిచిపోయెను. ఉపవాసదినము ప్రతిష్ఠించుడి వ్రతదినము ఏర్పరచుడి. యెహోవాను బతిమాలుకొనుటకై పెద్దలను దేశములోని జనులందరిని మీ దేవుడైన యెహోవా మందిరములో సమకూర్చుడి. యోవేలు 1:13, 14.*

*ఒకవేళ ఆయన మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తాపపడి మీ దేవుడైన యెహోవాకు తగిన నైవేద్యమును పానార్పణమును మీకు దీవెనగా అనుగ్రహించును; అనుగ్రహింపడని యెవడు చెప్పగలడు? యోవేలు 2:14.*

పైన చెప్పబడ్డ సంఘటనలన్నియు అసాధారణమైన పరిస్థితులు. దేవుడైన యెహోవా ఒక పెద్ద కార్యాన్ని చేయబోతున్నాడు. అయితే అది ఆయన ప్రజల భద్రతను మరియు బాగును భయభ్రాంతులకు గురిచేసింది, ఎందుకంటే వారందరు పాపం చేసారు. వారిని శిక్షించాలనే దేవుని ఉద్దేశం మారుతుందనే నిరీక్షణను ప్రజల ఉపవాసం తమకెలా కలిగించింది? దేవుని చర్యకు ప్రతిస్పందనగా వారు చేసిన దానిలో ఒక భాగము ఏమిటంటే ఏడ్చుచూ గోనెపట్ట కట్టుకొని ప్రార్థించారు; అయిననూ, ఉపవాసం ఒక విభిన్నమైన యత్నాన్ని కోరుతుంది. కొంత పొడగించబడిన కాలం చేసే ఉపవాసమైనా లేక ఒక పగలు మరియు ఒక రాత్రి చేసే ఉపవాసమైనా సరే క్రమశిక్షణ అవసరం. బహుశ చివరి ప్రయత్నం జరిగేవరకు ఇలాంటి స్వతహా క్రమశిక్షణను ప్రజలు సాధారణంగా మానేస్తారు. పరిస్థితి భయానకంగా ఉందనే వాస్తవాన్ని వారు అంగీకరించిన తర్వాత మాత్రమే ఉపవాసం చేసే నిమిత్తం తమ్మును తాము క్రమశిక్షణలో పెట్టుకోవడానికి వారు ఇష్టపడతారు. మిత ఆహారాన్ని తినాలని మనం ఎన్ని సార్లు నిర్ణయించుకున్నాం? మిత ఆహారాన్ని కొనసాగించుటకు మనల్ని మనం క్రమశిక్షణలో ఉంచుకొనుటకు మనం ఎన్ని సార్లు విఫలమయ్యాం?

మన తండ్రియైన యెహోవా దేవునికి ఉపవాసములు అన్నీ అంగీకారయోగ్యమైనవి కావు. యేసుక్రీస్తు సంబోధిస్తున్న యూదుల పితరులకు చెప్పబడిన యెషయా హెచ్చరికను యేసు ఆలోచించగలిగియుండవచ్చు. యూదా ఉపవాసంలో ఉన్న తప్పు ఏమిటో యెషయా చూపించిన దానిని మనం గమనించాలి. అలాగే మరి సరైనది ఏమిటో కూడా గమనిద్దాం.

*మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు? మేము మా ప్రాణములను ఆయాస పరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు? అని అందురు. మీ ఉపవాసదినమున మీరు మీ వ్యాపారము చేయుదురు. మీ పనివారిచేత కఠినమైనపని చేయించుదురు. మీరు కలహపడుచు వివాదము చేయుచు అన్యాయముగా గుద్దులాడుచు ఉపవాస ముందురు. మీ కంఠధ్వని పరమున వినబడునట్లుగా మీరిప్పుడు ఉపవాస ముండరు. అట్టి ఉపవాసం నాకనుకూలమా? మనుష్యుడు తన ప్రాణమును బాధపరచుకొనవలసిన దినము అట్టిదేనా? ఒకడు జమ్మువలె తలవంచుకొని గోనెపట్ట కట్టుకొని బూడిదె పరచుకొని కూర్చుండుట ఉపవాసమా? అట్టి ఉపవాసం యెహోవాకు ప్రీతికరమని మీరనుకొందురా? దుర్మార్గులు కట్టిన కట్లను విప్పుటయు కాడిమాను మోకులు తీయుటయు బాధింపబడిన వారిని విడిపించుటయు ప్రతి కాడిని విరుగగొట్టుటయు నే నేర్పరచుకొనిన ఉపవాసం గదా? నీ ఆహారము ఆకలిగొనినవారికి పెట్టుటయు నీ రక్త సంబంధికి ముఖము తప్పింపకుండుటయు దిక్కు మాలిన బీదలను నీ యింట చేర్చుకొనుటయు వస్త్రహీనుడు నీకు కనబడినప్పుడు వానికి వస్త్రము లిచ్చుటయు ఇదియే గదా నాకిష్టమైన ఉపవాసం? ఆలాగున నీవు చేసినయెడల నీ వెలుగు వేకువ చుక్కవలె ఉదయించును స్వస్థత నీకు శీఘ్రముగా లభించును నీనీతి నీ ముందర నడచును యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును కావలికాయును. అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తర మిచ్చును నీవు మొఱ్ఱపెట్టగా ఆయన-నేనున్నాననును. యెషయా 58:3-9.*

“నిష్కాపట్యదృష్టి”తో ఉపవాసం చేయటం అంటే దేవుడ్ని మన శ్రోత వలె ఉంచుకొని ఉపవాసాన్ని చేయటం యేసు యొక్క ఆనాటి శ్రోతలు గ్రహించాలని యేసు కోరుకున్న పాఠం ఇదే. అయితే ఆయన మాట్లాడిన దాని యొక్క ప్రతిఫలాన్ని వారు అర్థం చేసికోలేదని తెలుస్తుంది. దేవుడు తన ప్రవక్తయైన యెషయా ద్వారా మనకున్న ప్రతిఫలాన్ని స్పష్టంగా వివరించాడు. మత్తయి 5:13-16లో యేసు చెప్పిన దానిని అతడు చెప్పాడు. “ఉప్పు మరియు వెలుగు”గా పనిచేసేలా క్రైస్తవులకు సహాయం చేసే శక్తి సామర్థ్యత ఉపవాసానికి ఉంది. అది ఎలా చేస్తుంది? పైన చెప్పబడిన పాత నిబంధన వృత్తాంతముల అభ్యాసంలో ఈ ప్రశ్నకు జవాబు దొరికింది. సరైన ఉపవాసం ఎల్లప్పుడు “మన మతాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచిద్దాం” అనే అర్థంతో ఉంటుందని మనం గ్రహించాము. దేవునితోను, మన జీవితాలతోను, ప్రత్యేకంగా మన జీవితాలలో ఉన్న పాపంతోను ఆడటం ఆపాలి. ఒక నిర్దిష్టమైన పాపంతో మన కొక సమస్య ఉన్నట్లయితే మనల్ని మనం సంపూర్తిగా “గోనెపట్టలతోను మరియు బూడిదెలోను” తగ్గించుకోవాలి. బహుశ భౌతికంగా కాకపోవచ్చు గాని ఖచ్చితంగా ఆత్మీయంగా అలా చేయాలి. మన గర్వమంతటిని విడిచిపెట్టి ప్రార్థనలో ప్రభువుతో మాట్లాడాలి. ప్రార్థనలో “మన ప్రాణాలను ఖాళీ చేసుకొనుటకు” ఉపవాసం ఒక బలమైన సహకారి అని మనం గ్రహించాము. స్వ-పరిశీలన, ప్రార్థన మరియు ఉపవాసం అనే ఈ సమయానికి దేవుని వాక్య అభ్యాసాన్ని కూడా మనం చేర్చాల్సిన అవసరం ఉంది.

ఇతరుల అవసరతల పట్ల మనం స్పందించేలా ఉపవాసం తప్పక సహాయం చేయాలని యెషయా, దేవుని పక్షంగా మాట్లాడుతున్నప్పుడు సూచించాడు. ఆకలితో ఉన్న ప్రజలు ఆకలి గల ఇతర ప్రజలను గుర్తించగలరు. కనీసం ప్రారంభంలోనైనా, ఉపవాసం చేసే ప్రజలు ఆకలిగా ఉంటారు. భూమి మీద దేవుడు మన స్వాధీనంలో పెట్టిన విషయాలలో మనం మంచి పరిచారకులుగా ఉండేలా ఉపవాసం మనల్ని నడిపిస్తుంది.

కనబడిన వినాశనాన్ని బట్టి మనం భయభ్రాంతులమై మనకు మనం సహాయం చేసుకోలేని సమయంలో, మనకు దేవుని హస్తము యొక్క శక్తి కావాలి. ఆయనను మనం వేడుకుంటున్న

దాని విషయంలో మనం తీవ్రంగా ఉన్నామని ఆయన ఎరిగియుంటే, మనం సాక్ష్యమిస్తుండగా, ఆయన ఆలకించటానికి మరింత శ్రద్ధ నిలుపుతాడు. ఆయన మన కోసం విషయాలను మార్చవచ్చు. మన దేశానికి గాని, మన ప్రియులకు గాని లేదా మనకు గాని నాశనం కలిగినప్పుడు ఉపవాసం అనేది మన బాధ ద్వారా పని చేసే సందర్భానికి తగినదై వున్నది. బాధ మరింత లోతుగా ఉన్నప్పుడు, చాలా మంది ప్రజలకు ఆకలిగా ఉండదు. దావీదు మరియు ఇతరులు దేవుని సన్నిధిలో ఏడ్చేలా ఉపవాసం సహాయం చేసింది. మన తండ్రి సంరక్షిస్తాడని క్రైస్తవులుగా మనకు తెలుసు. ప్రజలు వారి ప్రియులను పోగొట్టుకున్నప్పుడు వారి బాధ గురించి యేసు త్వరగా స్పందించాడు, ఆయన కూడా వారి బాధను అను భవించాడు గనుక దేవుడు ఎంత సున్నితుడో ఎంత త్వరగా స్పందిచగలడో మనకు తెలుసు. పరిశుద్ధమైన మరియు నీతివంతమైన జీవితాలను జీవించటానికి జ్ఞానాన్ని అనుగ్రహించమని మనం నిజంగా దేవుడ్ని అడిగితే ఇంతకంటే మనం ఏమి చెప్పగలం, మనం మన ప్రార్థనకు ఉపవాసాన్ని జోడిద్దాం. పెద్దలను నియమించే విషయంలోను మరియు సువార్తీకరణ నడిపింపులోను దేవుని జ్ఞానాన్ని కోరిన సంఘనాయకులు ఉపవాసం చేసారు. దయచేసి ఉపోద్ఘాతాన్ని మరలా చూడండి. ధ్యానము అనే దానికి ఆటంకములేని స్వేచ్ఛాపూరిత వాతావరణము కావాలి. ఆహార జీర్ణ ప్రక్రియకు రక్తసరఫరా అవసరమైయుంటుంది. ఈ ప్రక్రియ లేనిచో మరింతగా మెదడు ఆలోచించటానికి మరియు ధ్యానం చేయటానికి రక్తము సరఫరా చేయబడగలదు. కొన్ని రోజుల పాటు ఆహారం లేకుండా ఖాళీగా ఉన్న పొట్ట బహుశ ధ్యానం చేయటానికి చేసే ఆలోచనకు ఆటంకం కాకపోవచ్చు.

## సారాంశం

పెళ్లి కుమారుడు పరలోకానికి తిరిగి వెళ్లాడు. క్రొత్త నిబంధనలో ఉన్న విశ్వాసుల సమాజం వలెనె నేటి క్రీస్తు సంఘాలు దేవునితోను మరియు క్రీస్తుతోను అదే విధమైన సహవాసంలో ఉండాలని ఆశించబడ్డాయి. ఉపవాస విషయంలో మనం చాలా వరకు మౌనంగా ఎందుకు మిగిలిపోయాం? మనుష్యులకు కనబడవలెనను ఉపవాసం ద్వారా మనం కచ్చితముగా నిందింపబడము. దీనికి వ్యతిరేకముగా మనము మన పరలోక తండ్రి చూచునట్లు సంఘముగా ఉపవాసముండము. మనమెందుకు ఉపవాసముండము? మనం కీర్తనలు పాడతాము, ప్రార్థిస్తాము, కానుకలు ఇస్తాము అలాగే ప్రతి ప్రభువు దినమున సిలువపై యేసు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకుంటాము. ఎందుకంటె ఈ నీతికార్యాలు విలువను కలిగియున్నవని మనం నమ్ముతున్నాము. కాని చాలా అరుదుగా సంఘముగా మనం ఉపవాసముంటాము. ఉపవాసం చేసే శిష్యునిగా ప్రభువు మనకు ప్రతిఫలమివ్వాలని మనం ఆశించడంలేదనేది స్పష్టం.

మన బోధలో ఒక భాగంగా ఉపవాసాన్ని బోధింపక వదిలివేయడానికి బహుశ ఇదే కారణం కావచ్చు. అంటే కొంత మంది ఉపవాసం చేస్తున్నారని, మరికొంత మంది చేయడం లేదని చెప్పడానికి కాదు. అయిననూ, ఇది మన బోధ క్రమంలో నుండి స్పష్టంగా తొలగింపబడింది. క్రొత్త నిబంధన సంఘం ఉపవాసాన్ని ఒక ఆచారంగా గాని లేదా ఏదైనా క్రమంలో గాని, అంటే ప్రభురాత్రి భోజనాన్ని వారు చేసినట్లుగా ఉపవాసాన్ని చేసినట్లు మనకెలాంటి ఆధారం లేదు. ఒక తీవ్రమైన విషయంలో నిర్ణయం తీసుకోవడానికి క్రొత్త నిబంధన సంఘం ఉపవాసాన్ని చేసినట్లుగా మనకు కనబడుతుంది. సరైన ఉద్దేశంతో ఉపవాసం చేసేవారికి ప్రతిఫలం ఉందని యేసు చెప్పాడు. దానములివ్వడం, ప్రార్థన చేయడం అనేవి మనుష్యుల మెప్పు కోసం జరగకూడదు అలాగే ఉపవాసం కూడా మనుష్యుల మెప్పు కోసం జరగకూడదు. మనుష్యుల నుండి ఒకవేళ మనం కొంత మెప్పును పొందగలిగినా ఈ విషయాలను చేయటాన్ని బట్టి మనకు రావలసిన నిజమైన ప్రతిఫలం రాదు. దేవుడే మన శ్రోత మరియు మన కోసం ప్రతిఫలమున్నదని మనం వాటిని చేయాలి.

ఉపవాసం చేయడం ద్వారా వచ్చే ప్రతిఫలం ఏమిటి? భూమి మీద యేసు తన పరిచర్యను ప్రారంభించటానికి ముందు ఆయన ఎందుకు ఉపవాసం చేసాడు. ఒక గొప్ప నిర్ణయాన్ని తీసుకొనేటప్పుడు గాని ఒక పని చేసేటప్పుడు గాని క్రొత్త నిబంధన సంఘం ఎందుకు ఉపవాసం చేసింది? దేవుడు రహస్యమందు చూచి ప్రతిఫల మిచ్చేవాడైతే, వారు తమ విన్నపాలతో పాటుగా ఉపవాసం చేయటాన్ని బట్టి వారు ఖచ్చితంగా ప్రతిఫలాన్ని వెదుకుతున్నారు. ఉపవాసం యొక్క నిజమైన ప్రయోజనాన్ని మనం తెలుసుకొనుటకు "సాధకమగు విశ్వాసము"ను జరిగించడమే మార్గం. మనం ఉపవాసాన్ని ప్రయత్నించలాల్సిన అవసరం ఉంది.

ఈ లోకంలో దేవుని కోసం ఒక క్రైస్తవుడు సేవచేయ కోరినప్పుడు, "వారు మన సత్క్రియలను చూచి మన పరలోకపు తండ్రిని మహిమపరచెదరు" అనే రీతిలో ఆ సేవ జరిగించబడాలి. మనం ఏ ఆటంకాలు లేకుండా ఈ కార్యక్రమాన్ని పునఃపరి శీలించాలి. ఈ సేవపై దేవుడు ఏమి బోధించాడో మనం ఇప్పటికే తెలిసికొని యుండాలి. మనం కేవలం దేవుని బోధలను తీసుకొని వాటిని మన జీవితాలలో ఒక ఆత్మీయపనిగా జరిగించటానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాము.

దానములివ్వడం మరియు ప్రార్థన చేయడం వంటి నీతికార్యాలలో ఉపవాసం కూడా ఒక భాగమే. అయిననూ, ఇది సరైన ఉద్దేశంతో జరిగించబడాలి. మనం సాధారణంగానే కన్పించాలని యేసు చెప్పాడు. దేవుని పట్ల మనకున్న సమర్పణను గూర్చి మనుష్యులకు తెలియజేసి మెప్పు పొందాలని ముఖాలను విచారం చేసుకోవద్దు. ఈ రోజు మనం అంతగా ఉపవాసం చేయకపోవచ్చు; అయినా, కొన్ని సార్లు మన ఇబ్బందికర పనులను గూర్చి యితరుల నుండి అనుగ్రహం పొందాలని విచార ముఖాలను మనం కలిగియుంటాము. మనుష్యుల యొద్ద నుండి ప్రతిఫలం పొందుటకు ఇది ఏ మాత్రం మంచి మార్గం కాదు అలాగే ఖచ్చితంగా దేవుని యొద్ద నుండి ఏ ప్రతిఫలము

రాదు. తప్పుడు ఉద్దేశంతో మనం ఉపవాసం ఉన్నప్పుడు నిత్యత్వం కొరకు పరలోకంలో దేవునితో ఏ విధమైన గుణ నిధులను మనం దాచుకోము.

## చర్చ కోసం ప్రశ్నలు

1. భౌతిక ఉపవాసాన్ని నిర్వచించండి.
2. వ్యక్తిగత ఉపవాసాన్ని గూర్చి 1 కొరింథీ. 7:5 ఏమి సూచిస్తుంది?
3. "క్రీస్తునందు" ఉన్న మనలో అనేక మంది ఈ రోజు ఎందుకని ఉపవాసం చేయడం లేదు?
4. బాప్తిస్మమిచ్చు యోహాను మరియు అతని అనుచరులు ఉపవాసమున్నట్లుగా యేసు మరియు ఆయన అనుచరులు ఎందుకు ఉపవాసముండలేదు?
5. పౌలు మరియు సంఘనాయకులు ఉపవాసమున్న రెండు సందర్భాలను పేర్కొనండి.
6. యూదులు వారి పాపాలను ఒప్పుకొనేలా ప్రభావం చూపిన ఎజ్రా/నెహెమ్యా సందర్భంలో ఉన్న మూడు మూలకములు ఏమిటి?
7. ఇశ్రాయేలీయులు బేతేలునొద్ద కూడి ఉపవాసంతో పాటుగా దహన బలులను, సమాధాన బలులను అర్పించిన తర్వాత వారికొచ్చిన ప్రతిఫలం ఏమిటి?
8. మూడు రోజుల ఉపవాసాన్ని గూర్చి సూచనగా ఉన్నది ఏమిటి?
9. ఇతర ఉదాహరణలకు విభిన్నంగా సౌలు మరణించినప్పుడు జరిగిన ఉపవాసం ఎలాంటిది?
10. ఉపవాసం యొక్క ప్రయోజనాన్ని క్రైస్తవులు ఎలా తెలుసుకోగలుగుతారు?
11. దావీదు యొక్క కుమారుడు చనిపోవునని దేవుడు శాసించినప్పుడు అతడెందుకు ఉపవాసం చేసాడు?
12. పాత నిబంధన ఉదాహరణలలో ప్రార్థనకు ఉపవాసానికి ఉన్న సంబంధాన్ని వివరించండి.
13. సమాజంగా కూడి చేసే ఉపవాసంలో ఉండే సరైన మరియు తప్పుడు వైఖరులను గూర్చి యెషయా 58:3-9లో మనం నేర్చుకున్న ముఖ్య విషయాలను పేర్కొనండి.
14. సంఘాలు ఉపవాసాన్ని ఆచరించక పోవడానికి కారణం ఏమైయుండచ్చు?
15. క్రైస్తవులు ఉపవాసం ఉంటున్నారని ప్రతి ఒక్కరూ తెలుసుకునేలా చేయడంలో తప్పు ఏమిటి?